# సిల్కు చీర

కాకాని కమల



చుక్కమ్మకి దిగులుగా ఉంది.

కానీ ఖర్చు పెట్టటాని క్కూడా స్వతంత్రం లేని బ్రతుకై పోయింది కదా తనది అనుకుంటే రోషంతో కళ్ళు ఎర్ర బడుతున్నాయి. ముక్కు పుటాలు అదురుతున్నాయి.

బియ్యం చేట ముందు పెట్టుకుని గడపలో కూర్చుందన్న మాటే గాని బియ్యంలో రాళ్ళు కనబడటం లేదు. మాటి మాటికీ కళ్ళ నిండా నీళ్ళు నిండి చూపు మసకబారుతూంది. తను కూడా ఎలాగైనా డబ్బు సంపాదించాలి. ఎలా?

ప్రొద్దున్నే చీకటేళ పొరుగూరికి పొలం పోతూ భర్త వీరయ్య అన్న మాటలే మనసును కుమ్మరి పురుగుల్లా దొలుస్తున్నాయ్.

అసలు ఈ రోజే కాదు. ఈ మధ్య తను ఏ చిన్న కోరిక కోరినా తీసి పారేస్తున్నాడు. ఇంకో నెల రోజుల్లో శ్రావణం వస్తూంది. పౌర్ణమి ముందు పోలేరమ్మ జాతర. తనకి వీరయ్యతో మనువు జరిగి నాలుగేళ్ళు దాటుతూంది. కాని ఇంకా తన కడుపు పండలేదు.

ఈ శ్రావణం నాటికి గ్గాని తను నీళ్ళోసుకుంటే పేటపోతుని 'బలి' ఇచ్చి నూటొక్క ప్రదక్షిణాలు చేస్తానని పోలేరమ్మకి మొక్కుకుంది. 'తల్లి' కరుణించింది. ఇప్పుడు మూడో నెల తనకు. మొక్కు తీర్చాలా వద్దా మరి?

తన వాడకట్టు సావాసకత్తెలందరూ ఈ ఏటి జాతర నాటికి సిల్కు చీరలు కొనుక్కుంటున్నారు. తన క్కూడా ఓ సిల్కు చీర కొనియ్యమని వీరయ్య మావని - తన పెనిమిటిని అడిగింది.అదితప్పా?

ఎదిరింటి కోటయ్యనో, పక్కింటి నాయుణ్ణో పోయి అడగ లేదే? చీర కొనియ్యమని...అయినా -

పట్టు కోకంటే ఎంత భాగ్యం? వేలా? లక్షలా? మూడు వందలు పెడితే ముచ్చటైన కోక వస్తుంది. ఏడాదికి ఒక్క మారొస్తుంది పోలేరమ్మ సంబరం. అప్పుడే తన పేట ఆడంగులంతా పట్టు కోకలు కొనుక్కొని మంచి జాకెట్లు కూడా కుట్టించుకొంటున్నారు.

ఈ ఏటి జాతర నాటికి తనక్కూడా ఓ ఎర్రటి పట్టు కోక చిలకాకు పచ్చ అంచుతో ఉన్నది కొనియ్య మని తన పెనిమిటిని అడిగింది. ఆరు ఎకరాల సేద్యం, రెండు ఎకరాల మెట్ట ఉంది. ఆ మాత్రం పెళ్ళాం ముచ్చట తీర్చలేడూ? అబ్బే!.

పట్టుకోక పేరెత్తగానే గయ్యి మంటూ ఒంటి కాలి మీద లేచాడు పొద్దున్నే.

"పట్టుకోక లేకపోతే జాతర జరగనంటుం దా? వేటపోతుకే ఓ నాలుగొందలు కావాలి. ఇంకా పండగ ఖర్చులు వేరే ఉండనే ఉన్నాయి. నా అక్క చెల్లెళ్ళు పిల్లల్తో వస్తారా.ఇంకా నీకు సిల్కు కోకంటే నే నెక్కడ తేనూ? నా దగ్గర అంత డబ్బు లేదు. ఇంకా "ఎరువు' కొనాలి. ఎడ్లకి మాయరోగ మొచ్చి నచ్చేటట్లున్నాయ్. ఈ ఏడన్నా కొత్త ఎడ్ల జత కొనాలి. సంబరం నాటికి ఏదో కోక కొనిస్తాలే" అంటూ ఒంటి కాలితో అగ్గి మీద గుగ్గిలం లా రవరవ లాడిపొయ్యాడు. తింటున్న అన్నం పళ్ళెంలో చెయ్యి కడిగి లేచి పొయ్యాడు.

'ఏదో కోక' అంటే ఏంటి? ముష్టి ముప్పై రూపాయల ముతక కోకేగా? ఏటా కొనిచ్చే లాంటిదే.

తను కాపురానికి వచ్చి నాలుగేళ్ళు అవుతూంది. ఏణ్ణర్థం క్రితం అత్తమ్మ చచ్చి పోయింది. అత్తమ్మ బతికున్నన్నాళ్ళూ పోరు కాపురమే. తన్ని సుఖ పడనిచ్చిందా? కొత్త గుడ్డ కట్టుకుని తలనిండా

పూలు ఎట్టుకుంటేచాలు రవరవ లాడి పోయేది. 'ఒరే వీరన్నా' అంటూ అర్ధరాత్రి పన్నెండయినా కొడుకుని ఒదిలేది కాదు. నాలుగు నెల్లకోసారి కూతుళ్ళని, మనవల్ని కోతులదండులా ఇంటికి తెచ్చి అవీ ఇవీ మేపి సాగనంపేది. తల్లి ఎంత అడిగితే అంత చేతిలో పెట్టేవాడు తన భర్త .

అప్పుడు అప్పులు అవసరాలు గుర్తుకు వచ్చేవి కాదు కాబోలుమరి.. తను నోరు తెరిచి మంచి సిల్కు కోక కొనియ్యు మంటే ఎక్కడ లేని ఇబ్బందులూ ఏకరువు పెడుతున్నాడు. ఛ ..పాడు బతుకై పోయింది తనది. కడుపు కింత తినగానే సరా? చెంపల మీద కారుతున్న కన్నీటి ముత్యాల్ని చీర చెంగుతో తుడుచుకుంది చుక్కమ్మ.

తమ వాడకట్టులో కొందరు ఆడంగులు కూడా ఇంటి పట్టున ఊరికే కూర్చోవటంలేదు. చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నారు. పాలూ, పెరుగూ అమ్మటం,బర్రెల్నిగొర్రెల్నిసాకడం, కోళ్ళు పెంచటం, రాట్నం మీద కండె దారం తియ్యటం,. బీడీలు చుట్టటం లాంటి ఎన్నో రకాల పనులు చేసి డబ్బు సంపాయిస్తున్నారు. పక్క పేట సావిత్రి, మంగ,సుబ్బులచ్చి..అలాగ్గాదూ సంపాయిస్తుంట?

అందుకే తను కూడా పాల వ్యాపారం పెడతా నని,నాలుగు బర్రెల్ని కొనమని అడిగింది భర్తని. కాని పడనిస్తేనా?

"ఆఁ అయ్యన్ని నీకెందుకే చుక్కా? ఇంకా చిన్న తనం. అమ్మ ఉంటే నన్నా చూసుకునేది.పదిరూపాయిల రాబడే నూత్తున్నావ్ గాని ఎంత చాకిరి? పైగా ఏదన్నా రోగం తగిలి ఒక్క బర్రె సచ్చిందంటే వేలు నష్టం. పిచ్చి పిచ్చి ఆలోచన్లు మాని హాయిగా తిని ఇంటి పట్టున ఉండు" అంటూ కసురుకుని చిరాకు పడ్డాడు వీరయ్య. పోనీ పొలం పన్లకి పోతానన్నా పోనియ్యడు. "లింగు లిటుకు మంటూ ఉన్నది ఇద్దరం. నా రెక్కల కష్టం చాలదా?" అంటాడు. కాని ఎక్కడ చాలుతుంది? ఏడాది కొసారి చక్కటి పట్టుకోక కొనియ్యి మంటే అప్పుల పురాణం చెప్తాడా? తనకి ఏ అవసరం వచ్చినా రూపాయి అర్ధక్కూడా అడగాల్సి వస్తుంది. చిన్నగా నిట్టూర్చింది చుక్కమ్మ.

అందుకే ఎలాగైనా తను కొంచెం డబ్బు సంపాదించాలి. కాని... ఎలా?

చెక్కిట చెయ్యి చేర్చి ఆలోచన్ల మధ్య యథాలాపంగా తలయెత్తిన చుక్కకి పెరట్లో బావి పక్కన ఎత్తుగా పెరిగి నవనవ లాడుతూ గుత్తులు గుత్తులుగా మునగకాయలు నిండిన చెట్టు,పక్కన అరచేతంత రేకలతో తెల్లగా విరగబూసిన అవిసె చెట్టు కనిపించాయ్.

చుక్కమ్మ మెదడులో మెరుపులా ఒక చిన్న ఆలోచన. బియ్యం చేట తీసి పక్కన పెట్టి గబాల్న లేచి పెరట్లోకి వచ్చింది.

'అవును. నేను కూడా ఈ రోజు నుంచి ఏదైనా పనిచేసి కొద్దిగా అయినా సంపాయిస్తాను. లేకపోతే మరీ పరాధీనం బతుకైపోతూంది' అనుకుంది.

ఇన్నాళ్ళూ ఈ మునక్కాడలు ఇరుగు పొరుగులకు ఊరికేనే పంచిపెడుతూంది. కాని ఇక ముందు అలా చెయ్యకూడదు. అప్పటికప్పుడే నిశ్చయించుకుంది.

వారానికి రెండుసార్లు ఊరి చివర సంత జరుగుతుంది. ఆ సంతకి తాను కూడా వెడుతుంది ఇంటికి కావల్సిన బేడాలు కొని. తేవటానికి. కాని 'ఈసారి కొంటానికి కాదు ! సరుకు అమ్మకానికే వెళ్ళాలి.

మనసులో ఆలోచన హుషారు నిచ్చింది.

తాత్కాలికంగా దిగులు మాయమైంది. గభాల్న చెట్టు దగ్గరికి వచ్చి చీర కుచ్చెళ్ళు పైకి మడిచి, పమిట కొంగు నడుం చుట్టూ బిగించి కొక్కెం తగిలించిన పెద్ద గెడకర్ర బయటికి తీసి అరుగెక్కి అందినకాడికి మునగ కాయల్ని తెంపింది. గుత్తులు గుత్తులుగా చిటికెలో తట్టెడు కాయలు రాలాయి. లోపల్నుంచి ధాన్యం తట్ట తెచ్చి కాయలన్నీ తట్టలో ఓ పక్కగా పేర్చింది.

ఆ రోజు బుధవారం. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఎనిమిది దాకా ఊరి చివర పెద్ద సంత జరుగుతుంది. మళ్ళీ సోమవారం సంత జరుగుతుంది. వారానికి రెండుసార్లు. చుట్టు పక్కల ఉన్న పది గ్రామాల నుంచి జనం ఆ సంతకి వస్తారు.

అవిసె పువ్వులు కూడా రేకలు తునిగి పోకుండా జాగ్రత్తగా తెంపి తట్టలో సర్దింది. శుభ్రమైన పాత గుడ్డ తెచ్చి తడిపి తట్ట మీద కప్పింది. అప్పటికి మధ్యాహ్నం పన్నెండు దాటుతూంది.

వీరయ్య బాగా పొద్దు పోతే గాని రాడు. అక్కడికి ఐదు మైళ్ళ దూరంలో ఉన్న పొరుగూళ్ళో సొంత సేద్యం. అక్కడ ఇళ్ళు లేవు. సౌకర్యం అంతంతమాత్రమే. పైగా పాములు, దుమ్మగుండ్ల భయం బాగా ఉంది. అందుకే ఇళ్ళు ఈ ఊళ్ళో ఏర్పాటు చేశారు.

రాత్రికి వీరయ్య లంటికి వచ్చేలోగా తన పని చక్క పెట్టెయ్యాలి అనుకొంది.

చీర మార్చుకొని ముఖం కడిగి బొట్టూ, కాటిక పెట్టింది. నీలం రంగు పూల రైక తొడుక్కుని సిగమీద గన్నేరు పూలు గుచ్చింది. కంచం పెట్టుకుని ఇంత అన్నం తిని తలుపుకి తాళం పెట్టి తట్ట తల నెత్తిన పెట్టుకొని సంతకి బయలుదేరింది.

ఇంతకు ముందు సంతకి వెడితే వీరయ్య ఇచ్చిన డబ్బులు రొంటిని దోపుకొని కాళీ తట్ట నెత్తిన పెట్టుకొని, వచ్చేటప్పుడు దాన్నిండా సరుకులతో వచ్చేది. కాని ఇప్పుడు సరుకుతో సంతకి వెడుతుంటే ఉత్సాహం వచ్చింది. కొత్త ఆశ ఏదో మనసులో చిగురు తొడ గసాగింది.

ఇలా కూడబెట్టిన సొమ్మంతా ఒకచోట దాచాలి. ఈ ఏటికి లేకపోతే వచ్చే ఏటికయినా పట్టు కోక కొనుక్కోక పోతుందా? ముందు ముందు సొమ్ములు కూడా చేయించుకోవచ్చు!"

ఆలోచనల మధ్య అడ్డదార్న పడి అరగంటలో ఊరి చివరకి వచ్చింది. అప్పటికే దూరంగా మార్కెటు యార్డుకి పక్కగా సంత సంరంభం మొదలయ్యింది. వ్యాపారస్థులు తమ తమ సరుకులు తీసి నేల మీద వరుసగా దుకాణాలు పరిచి వాటి ముందు కూర్చున్నారు. రోడ్డు కవతలవైపు చింత చెట్టు కింద వరసగా ఎడ్ల బళ్ళు దించారు. పశువులు తాపీగా కూర్చుని గడ్డి మేస్తున్నాయ్. నాలుగు వైపుల్నుంచి వస్తున్న చిన్న పెద్ద పాటక జనంలో సంత కిటకిట లాడుతుంది.

ధాన్యాలు, అపరాలు, తినుబండారాలు, కూరలు, పళ్ళు, రకరకాల అలంకరణ సామగ్రి, పూసల దండలు, గవ్వలు, కుట్టిన చిన్నా పెద్దా బట్టలు, చీరలు, పంచెలు, ఇత్తడి, స్టీలు కంచాలు, ఇనుప సామాను. ఒకటేమిటి? సంతలో దొరకని వస్తువు లేదు.


చుక్కమ్మ గబగబా అక్కడికి వచ్చి ఒక్కసారి సంతంత కలయచూసి ఆడవాళ్ళు ఎక్కువగా ఉన్న దుకాణాలవైపుకి వచ్చి చివరలో కూర్చుని తట్ట కిందికి దించింది. తల మీద పెట్టుకున్న గుడ్డ తీసి పరిచి దాని మీద కూర్చుని తట్ట మీది బట్ట తీసి ఓ పక్కగా పెట్టింది.

అప్పటికే దుకాణాలు బాగా వెలిశాయి. ఇంకా కొందరు వ్యాపారస్థులు దూరంగా బళ్ళు దించుకుని సరుకులు మోసుకొస్తున్నారు. సంత చెయ్యటానికి వచ్చే జనం కూడా గుంపులు గుంపులుగా ఉన్నారు.

ఆ జనాన్ని దుకాణాల్ని, సందడినీ చూస్తుంటే చుక్కమ్మకి ఉత్సాహంగా ఉంది.

మొదటిసారిగా సంపాయిస్తున్నాను అనుకుంటూ గుండెలోంచి ఆనందం తన్నుకొస్తూ ఉంది.

ఓర కంటితో కూరగాయల బుట్టల వైపు చూసింది. వంకాయలు, సొరకాయలు, చిక్కుడు, చేమ, పచ్చిమిర్చి, అల్లం, క్యాబేజి బుట్టలు, బుడంకాయలు ఇలా రకరకాలు ఉన్నాయి గాని మునక్కాడలు, అవిసె పువ్వులు ఎవరూ



తెచ్చినట్టు లేదు. చుక్కమ్మకి గర్వం అనిపించింది. తన సరుకు ఎంత తొందరగా అయిపోతే తనకి అంత మంచిది. తొందరగా సందేళకి ముందే ఇంటికి పోవచ్చు. అయినా..."

"ఇంగో ములక్కాడ లెట్ల ఇస్తున్నావ్?"

ఉలిక్కిపడి తల ఎత్తింది. ఎవరో ఇద్దరు ఆడాళ్ళు బుట్టలో కాయల్ని చూసి అడుగుతున్నారు.

"రూపాయికి నాలుగు"

"ఐదిస్తావా?" బేరం ఆడారు.

"ఇవ్వను" అంటే ఎక్కడ వెళ్ళి పోతారో అని చెప్పి "సరే తీసుకోండ్రి..." అంది.

ఇద్దరూ చెరి రెండ్రూపాయలవి తీసుకొన్నారు. వీళ్ళు వెళ్ళకుండానే ఇంకో అవ్వ వచ్చింది. ఆ వెనక ఇద్దరు ఆసాములు వచ్చారు. ఒకరి వెనక ఒకరు... మునక్కాయలు వీళ్ళ సంచీల్లోకి డబ్బులు చుక్కమ్మ చేతిల్లోకి మారాయి.

చూస్తూ ఉండగానే గంటలో సగం తట్ట ఖాళీ అయ్యింది.

ఇందాకటి కంటె జనం తొక్కిడి ఎక్కువైయ్యింది. ఒకటే అరుపులు... కేకలు... "గీ" పు ని పిల్లల ఏడుపులు.

చుక్కమ్మ రొంటిలో చిల్లర డబ్బులు గల గల మన్నాయ్. ఎవరో వస్తున్నారు. మునక్కాడలు కొంటున్నారు. కాయలు ఖర్చు అయినట్లు అవిసె పువ్వులు ఖర్చు కావటంలేదే!

అవిసె పువ్వు ఎర్రగా నూనెలో వేయించి చింతపండు, పచ్చి మిరప వళ్ళు వేసి తొక్కి పోపు పెట్టి ఇంగువ నూనె పోస్తే గొప్ప రుచిగా ఉంటుంది. పప్పులో కూడా వేసుకోవచ్చు. కాని ఇది ఎక్కువ మందికి తెలియదు. అందుకే ఎవ్వరూ అవిసె పువ్వు కొనటం లేదు.

ఎలాగో సగం బుట్ట ఖాళీ అయింది. మిగతా సగం కూడా ఖర్చు అయితే బాగుణ్ణు. ఈపాటికి ఎంతొచ్చి ఉంటుంది.?

ఆశగా రొంటి నున్న సంచి తీసి చెవి దగ్గర పెట్టుకుని ఒకసారి గలగల్లాడించింది.

"నాలుగో... అయిదో... రాకపో..."

"ఏయ్ నిన్నే..." పెద్దగా కేక వినపడింది.

పులి గాండ్రింపు విన్న మేకలా తుళ్ళిపడి. గబాల్న తల తిప్పింది.

ఎదురుగా... కాకీ బట్టల్లో ఎర్రటి టోపీలో, పోలీస్ జవాను, ఆయన పక్కనే చిన్న పద్ధు పుస్తకంతో ఓ పాతికేళ్ళ కుర్రాడు నిల్చుని ఉన్నారు. చేతిలో లాటీ కర్రతో చుక్కమ్మ తట్ట మీద టక టకా కొట్టా డా పోలీసు.

"ఏయ్ అమ్మీ నీ పేరెమిటి?"

"చుక్కమ్మ"

"ఏం దమ్ముతున్నావ్?"

"మునక్కాయలు, అవిసె పువ్వు:

"గేటు కట్టావా?"

"గే... టా...?"

"అవ్..."

"అంటే?"

"వ్యాపారం చేస్తుండావ్ గదా? లైసెన్సు ఉందా అని అడుగుతున్నా"

చుక్కమ్మ గతుక్కుమంది.

"లై... సె... న... సా... లే... దు..." తల అడ్డంగా ఊపింది.

"మరి? లైసెన్స్ లేకుండా సరుకులమ్మి వ్యాపారం చేస్తున్నావా? ఇది గవర్నమెంటోళ్ళ స్థలం అనుకొన్నావా? నీ బాబుగాడి జాగా అనుకున్నావా? లెవ్... ముందా కూచున్న జాగా లోంచి లెవ్..."

చుక్కమ్మ బిక్క మొగం చూసేసరికి పోలీసులో హుకుం ఎక్కువైంది.

బూటు కాలితో తల మీద తన్నాడు.

"ఏందయ్యా అట్ల తంతావ్?" అంటూ గబాల్న తట్ట తీసి నిల్చుంది.

"చూడమ్మా! ఇక్కడ వ్యాపారం చేస్తే గేటు కట్టాలి. లేకపోతే కేసవుతుంది. పెనాల్టీ కట్టాలి!" పోలీసు పక్కనున్నాయన వివరించాడు.

"ఆఁ?"

"అవును." అంటూ పెన్నుతో చేతిలో పుస్తకంలో ఏదో రాశాడు.

"నడునడువ్. ఆఫీసు రూమ్‌లోకి. నీతో క్కూనుంటే మాక్కాదు" తొందర చేశాడు పోలీసు జవాను

చుక్కమ్మ గుండె ఆగినట్టయింది.

పోలీసులంటేనే ఆమెకి భయం. దానికి తోడు ఆఫీసు, కేసు అంటుంటే గుండె ధిగజారింది. కళ్ళ నిండా గిర్రున నీళ్ళు తిరిగాయ్.

"గేటు కట్టాలి బిడ్డా!..: లేకుంటె సర్కారోళ్ళు ఊరుకోరు." పక్కనే ఉన్న ముసలమ్మ సానుభూతి చూపించింది.

"అంతే మరి! ఎవర్నైనా హత్య చెయ్యాలంటే లైసెన్సు అక్కర్లేదు. కాని కష్టపడి కూలిపని చెయ్యాలంటే మాత్రం లైసెన్సు కావాలి మన దేశంలో." ఎవరో స్టూడెంటు కుర్రాడు రివ్వున సైకిల్ మీద పోతూ అన్నాడు. ఆ మాటకి గుర్రుమంటూ లాఠీ జాడించాడు. కాని ఆ కుర్రాడు దెబ్బకి అందలేదు.

"నడువ్!" తొందర చేస్తూ పోలీస్ మార్కెటింగ్ ఆఫీసు వైపు అడుగులు వేశాడు.

చుక్కమ్మకి సన్నగా కాళ్ళు చేతులూ వణకటం మొదలుపెట్టాయి. భయంతో గుండె గుప్పెట్లోకి వచ్చింది. కళ్ళ నిండా నీళ్ళు నిండాయి. ఏదో పెరట్లో కాసిన కాయలు అమ్ముకొని నాలుగు పైసలు చేసుకుందామనుకుందే గాని ఇన్ని తిరకాసులుంటాయని తెలియదు ఆమెకు.

పోలీసు వెంట ఆఫీసు గదికి వెళ్ళాలంటే భయంగా ఉంది. ముఖ్యంగా భర్తకి తెలిస్తే తన్నులు తప్పవ్!

"ఐదో పదో చేతులో పెట్టి తప్పయిపోంది అన్నా అంటే తను ఒదిలెయ్యక పొయ్యాడా? కాని అబ్బే... ఇది కొరకరాని కొయ్యలా ఉంది." పోలీసు మనసులో అసహనంగా ఉంది.

పోనీ ఏదన్నా నోరు విప్పిఅందామంటే దానికెంత గల్లంతవుతుందో అని భయంగా ఉంది. పైగా పక్కన "గేటు" వసూలు చేసే ఇన్‌స్పెక్టరు, ఇంకా ఎవరో ఆఫీసు వాళ్ళు ఉన్నారు.


మింగలేక కక్కలేక నోటికి వచ్చినట్లు తిడుతూ అసహనంగా ఆఫీసు గది వైపు అడుగులు వేస్తున్నాడు పోలీసు.


గుడ్లనీరు కుక్కుకుంటూ తడబడే అడుగుల్తో అనుసరిస్తూంది చుక్కమ్మ.

"ఏందమ్మా? పెండ్లి భోజనానికి వస్తున్నావా ఏంది? చెప్పేది వినరావటం లేదా?"

కళ్ళనీరు కొంగుతో తుడుచుకుంటూ తల ఎత్తింది.

"ఏందయ్యా! ఆమెని అదిలిస్తున్నావ్? ఏంది సంగతి?" ఎవరో పోలీసు చెయ్యి పట్టుకుని ఆపారు.



తనకి సుపరిచితమైన ఉరుములాంటి ఆ గొంతు వింటూనే తుళ్ళిపడి పక్కకి చూసింది చుక్కమ్మ.

ఎదురుగా వీరయ్య. తన భర్త!

మార్కెటింగ్ యార్డ్ ఆఫీసు గది కౌంటర్ దగ్గర నిల్చుని క్లర్కు అందించిన వంద రూపాయల కట్టలు లెక్కపెట్టుకుంటున్న వాడల్లా గబాల్న తల ఎత్తి గబగబా భార్య దగ్గరకి వచ్చాడు.

చుక్కమ్మ ఉబికి వస్తున్న కన్నీళ్ళు ఆపుకుంటూ మెల్లిగా భర్త వెనక్కు వచ్చి నిల్చుంది. ఆ క్షణంలో వీరయ్యని చూస్తే భయం అనిపించలేదు. కొండంత ధైర్యం వచ్చింది.

"ఏంటయ్యా సంగతి?" అంటూ పోలీసుని జమాయించాడు వీరయ్య.

"గేటు కట్టకుండా మునక్కాయలు అమ్ముతూంది." వీరయ్య ఆశ్చర్యంగా పెళ్ళాం కేసి చూశాడు.

"అవునా? ఏందే.... అమ్మింది?"

చుక్కమ్మ చప్పున తల దించుకొంది.

తట్టలో ఉన్న మునక్కాడలు, అవిసి పువ్వు చూడగానే వీరయ్యకి సంగతి అర్థమైంది.

"అలాగా! చూడు పటేలాయన! ఆమెకి తెల్వదనుకొ. నెమ్మదిగా చెప్పాలి గాని గట్లనేనా కసిరేటిది? నడువ్ ఎంత కట్టాలో కడతా" అంటూ కౌంటర్ దగ్గరికి వెళ్ళాడు పోలీస్ పక్కనే ఉన్న కుర్రాడు కాగితం మీద రాసి చింపి వీరయ్యకి ఇచ్చాడు.

పెనాల్టీతో కలిపి పది లోపే.

ఈపాటిదానికి అంత రాద్ధాంతం చెయ్యాల్నా? నెమ్మదిగా చెప్తే పోలే?" వీరయ్య కోపంగా చూసి ఆఫీసు గది కౌంటర్ దగ్గరికి వెళ్ళి డబ్బు కట్టి వచ్చాడు.

చుక్కమ్మ బితుకు బితుకు మంటూ తట్ట పట్టుకుని స్తంభం చాటుకి నక్కి కూర్చుంది. పావు గంటలో వీరయ్య చుక్కమ్మ దగ్గరికి వచ్చాడు.

"ఏంటే నువ్వు చేసిన నిర్వాకం? ఇంటి పనులు చక్కంగా చూసుకోలేవు గాని సంతలో కూరగాయ లమ్ముతావ్? ఒక్క రోజులో సంపాయించి సిల్కు కోక కొనేసుకుందామనే? పొద్దుట్నుంచి కూసుంటే ఏ మాత్రం వచ్చిందేం?" అన్నాడు ఎగతాళిగా.

అతని మాట పరుసుగా ఉన్నా కళ్ళు నవ్వుతున్నాయ్. కంఠం మెత్తగా కరుగుతున్నట్లు ఉంది.

"......."

"నే నా సమయానికి అక్కడ ఉండబట్టి సరిపోయింది గాని లేకుంటే ఏమయ్యుండేదానివి?"

చుక్కమ్మ ఒకసారి తలెత్తి వీరయ్య మొగం లోకి చూసి మళ్ళీ తల దించుకుంది. భర్త మొగంలో చిరు నవ్వు చూడగానే ధైర్యం వచ్చింది చుక్కమ్మకు.

"ఎరువు కొందామంటే నా చేతిలో చిల్లి గవ్వ లేదు. ఇయ్యాళ మన పురి లోంచి ధాన్యం తీసి పదిహేను బస్తాలు అమ్మాను. రేపు ఒంగోలు వెళ్ళి ఓ గిత్తల జత కూడా తెద్దా మనుకొంటున్నాను. అట్లాగే నిన్ను పట్నం తీసుకుపోయి ఓ సిల్కు కోక ఇప్పిద్దామనుకున్నాను. కాని ఏది? అప్పుడే రోడ్డు మీద పడితివి. నాలిగేళ్ళ సంది తిండి పెట్టి నిన్ను సాకటం లేదే? రేపట్నుంచి పిల్లగాడ్ని కూడా సాకాలాయే. లేకుంటే నీ సంపాదనతోనే అణ్ణి సాకుతావా?" మేల మాటాడు.

చుక్కమ్మ సిగ్గుల మొగ్గ అయ్యింది.

"ఛీ... పో... నీ కన్ని పరాచికాలే" అంటూ మొగం తిప్పుకొంది.

చిలకాకు పచ్చ రంగు అంచుతో ఎర్రటి సిల్కు కోక, పోలేరమ్మ సంబరం కళ్ళ ముందు కదులుతుంటే పకపక నవ్వింది. ★

మినీకథ

# ఆగదు! ఆనిముషమాగదు!

రావులపాటి రాజీవ్‌చంద్ర

అది ఎన్నోసారో చెప్పలేం కానీ ఓ రాత్రి సమయంలో హఠాత్తుగా అప్పారావుగారికి గుండెపోటు వచ్చింది. మాది అసలే ఒక్క సిమెంటు ఇల్లు కూడా లేని కుగ్రామం. అలాంటిది ఉన్నట్టుండి ఆ రాత్రిపూట డాక్టర్‌ని ఎలా పుట్టించగలం?

చేసేది లేక పాపం వారికి నాటు వైద్యంతో అప్పటికి సర్దుకునేట్లు చేశాం. కానీ ఎట్టి పరిస్థితుల్లో అయినా వారిని ఇంకో రెండు గంటల్లో పక్క ఊరికి తీసుకెళ్ళి వైద్యం చేయించకపోతే వారికి పరలోకదర్శన ప్రాప్తి కలుగుతుందన్న విషయం విదితమే

ఈ విషయం అర్థం చేసుకున్న గ్రామ ప్రముఖులంత నా వైపు చూడసాగారు. వా రలా, నా వైపు చూడటానికి కారణం నేనొక ప్రముఖవ్యక్తిననీ, నా సలహా తీసుకోవటానికే మాత్రం కాదు. వారి, ఉద్దేశమల్లా, ముప్పై కిలోమీటర్ల దూరం ఉన్న పక్క ఊరికి నేను నా స్కూటర్ మీద అప్పారావుగారిని తీసుకెళ్ళి వైద్యం చేయించటానికి సమ్మతిస్తానా, లేదా అని.

సైకిలు తొక్కటమే మహా పాపమైన ఆ గ్రామంలో స్కూటర్ వంటి వాహనమున్నది నా ఒక్కడికే నిజం చెప్పాలంటే వారానికి మూడు కిలో మీటర్లు కూడా స్కూటర్‌మీద తిరగవలసిన అవసరం నాకు లేకపోయినా, ఏదో సరదాపడి నే నా స్కూటర్ కొనుక్కొని నెల కోసారో, రెండుసార్లో పక్క ఊరికి వెళ్ళి సినిమా చూసి వస్తూ ఉంటాను. అలాంటిది ఇప్పుడు, కొన్న తరువాత మొట్టమొదటిసారిగా నా స్కూటర్ నిజంగా ఉపయోగకరం కాబోతున్నందుకు నాకు చాలా సంతోషమనిపించింది.

కానీ అప్పారావుగారిని తీసుకెళ్ళటంలో నా కొక చిక్కుంది ఆ చిక్కల్లా నాకు స్కూటర్ సరిగ్గా నడపటం రాకపోవటం మాత్రం కాదు. నేను ఎంత రద్దీ అయిన ప్రదేశంలోనైనా యాభై కిలోమీటర్ల వేగానికి తగ్గకుండా నడపగల సమర్థుడినే

నాకున్న చిక్కేమిటో కొందరు గ్రామ ప్రముఖులను పక్కకు తీసుకెళ్ళి చెప్పి "మీ రేమీ అధైర్యపడకండి. మనందరికీ ఆప్తులైన అప్పారావుగారిని కాపాడటానికి నే నామాత్రం సహాయం చేయలేనా?" అని ఒక డైలాగు వదలి అప్పారావుగారిని నా స్కూటర్ వెనుక సీటు మీద కూర్చోబెట్టుకుని, నన్ను గట్టిగా పట్టుకొమ్మని వారికి సలహా ఇచ్చాను.

నేను బయలు దేరబోయేముందు, నేను చేయబోయే త్యాగానికి తమ కళ్ళు చెమ్మగిల్లగా నాకు వీడ్కోలు తెలిపారు మా గ్రామ ప్రజలు.

బయలు దేరిన తరువాత కానీ నేను గ్రహించలేదు ఆ రోజు అమావాస్య అని. ఆ సంగతి గుర్తుకొచ్చి కూడా నేను నా ధైర్యాన్ని దిగజార్చుకోలేదు.

పట్టువదలని విక్రమార్కుడిలా ఆ అమావాస్యనాడు, ఆ అర్థరాత్రిపూట, ఒక్క స్ట్రీటో లైట్‌కి కూడా నోచుకోని ఆ మట్టిరోడ్డుపైన, వచ్చే పోయే ప్రతి వాహనం ఒక గండంలా తయారవ్వగా, వాటన్నిటినీ దాటుకుంటూ, అరవై కిలో మీటర్ల స్పీడుతో అర్థ గంటలో పక్క ఊరు చేరుకొని జనరల్ హాస్పిటల్ ముందు స్కూటరాపి, అప్పారావుగారిని హాస్పిటల్లో ఎడ్మిట్ చేసి అంతా సుఖాంతమే - అనుకొని ఒక్కసారి తేలికగా ఊపిరి పీల్చుకున్నాను.

** ** **

మరునటి రోజు డాక్టర్ని కలునుకోగానే అతడు నాతో "ఇంకో పావు గంట ఆలస్యమై ఉన్నా వారు మీకు దక్కేవారు కాదు. రియల్లీ యూ ఆర్ వెరీ లక్కీ," అన్నాడు.

అలా అతను నాతో చెప్పటం రాత్రి నుంచి అది పదవసారి కావటంతో నేను అతని మాటలని ఏ మాత్రం పట్టించుకోకుండా అప్పారావుగారి బెడ్‌ని చేరుకున్నాను.

అప్పటికి వారు ఎంతో తేలికపడ్డారు. నా వైపు ఎంతో కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ "నీ మేలు ఈ జన్మలో మరువలేను" అని పలికి ఒక ధర్మ సందేహాన్ని వెలిబుచ్చారు.

వారు పక్క మీద కాస్త సర్దుక్కూర్చుని, "నీవు నిన్న రాత్రి అంతటి చీకట్లో కూడా అంత వేగంగా నడపగలవని నే నూహించలేదు. నీవు నిజంగా స్కూటర్ నడపటంలో ఇంత ప్రావీణ్యం గల నువ్వు నిన్న రాత్రి అందరిని పక్కకు తీసుకెళ్ళి నీ కేదో చిక్కు సమస్య ఉన్నదన్నావని విన్నాను. ఏమిటోయ్ అది?" అన్నాడు.

నేను ఆ ప్రశ్నకు సమాధానంగా, "ఏదో దేముడి దయవల్ల మీరు ప్రమాదం నుంచి బైట పడ్డారు. నా కదే ఎంతో ఆనందంగా ఉంది. ఇక పోతే నా చిక్కు సమస్యేమిటంటే నాకు చిన్నప్పటి నుంచీ 'రేచీకటి' వ్యాధి ఉంది" అని అన్నాను.

అంతే అప్పారావుగారి గుండె ఆగిపోయింది

**లీడర్**

**'మాకెంత పెద్ద పార్టీయా! నేనే లీడర్ని. నేను ఎలా చెబితే అలా నడుచుకోవలసిందే అందరూ.'**

**'అబ్బా...ఏం పార్టీ అది.'**

**'బాండ్‌మేళం పార్టీ!'**

**-కె.వి.మధుసూదనరావు**